క్లుప్తంగా

వైభవంగా మరిడి మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మండలంలోని **యాదగిరిపాలెంలో** గురువారం మరిడి మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి పండగ



కొత్త మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: స్థానిక పేటకట్టు ప్రాంతంలోని కొత్త మహాలక్ష్మి పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా మే నెలలో పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పండగ నిర్వహించారు. టెక్కలి దేవయ్య, పెదసూరప్పారావు, వీరునాయుడు, శివ, శ్రీరామ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మూలపేట శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మూలపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మండలంలోని మూలపేట శ్మశానవాటికలో చేస్తున్న అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. చెత్త తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశానవాటికలో సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో యల్లపు రాజేశ్వరరావు, ఆడారి సత్యనారాయణ, భీశెట్టి నారాయణమూర్తి, సాంబశివ, మోహనరావు, హైమావతి నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునగపాక: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. మునగపాక, నాగులాపల్లి, ఉమ్మలాడ, ఒంపోలు, నాగవరం, వాడ్రాపల్లి, గంగాదేవిపేట తదితర గ్రామాల్లో సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

20న దేశవ్యాప్త సమ్మె



సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నేత సత్యనారాయణ

మునగపాక: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నేత గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సమ్మె పోస్టర్‌ను ఆయన గురువారం సాయంత్రం పీఏసీఎస్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేయడంతో పాటు సమాన పనికి సమాన వేతనం అందించాల్సి ఉన్నా ఎక్కడ అమలు కావడం లేదన్నారు. పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం కాగలవన్నారు. నాయకులు బ్రహ్మాజీ, రామలక్ష్మి, పార్వతి, శాంతి, సన్యాసిరావు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

అతివేగానికి కళ్లెం వేయరూ..





పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద నిలిచిన వాహనాలు

- పూడిమడక రోడ్డులో మితిమీరిన వేగంతో రాకపోకలు
- నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం
- పోలీసు కేసులు నమోదు
- తీరు మార్చుకోని భారీ వాహనాల డ్రైవర్లు



పూడిమడక రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనం

మునగపాక: పూడిమడక రోడ్డులో రయ్‌రయ్‌మంటూ వాహనాలు అధిక వేగంతో దూసుకుపోతున్నాయి. అసలే ఇరుకు రోడ్డు ఆపై భారీ వాహనాల రాకపోకలతో వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డులో అధిక వేగాన్ని పోలీసులు కళ్లెం వేస్తున్నా, భారీ వాహన డ్రైవర్లు, బ్రాండెక్స్ బస్సులు నడిపే వారు పట్టించుకోవడం లేదు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు.

భారీ వాహనాలకు కళ్లెం వేయరూ...?

అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా అచ్యుతాపురం, రాంబిల్లి తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు ప్రయాణం సాగిస్తున్నాయి. అచ్యుతాపురంలోని బ్రాండెక్స్‌కు పలు బస్సులపై ఉద్యోగులు, కార్మికులు ప్రయాణం సాగిస్తున్నారు. రాంబిల్లిలోని నేవీ పరివాహక ప్రాంతంలో జరుగుతున్న పనులకు ఈ మార్గం గుండా లారీలు తిరుగుతున్నాయి. అయితే సంబంధిత వాహన డ్రైవర్లు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. వాహనాలను తప్పించే క్రమంలో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

దాడులు చేస్తున్నా పట్టని వాహన డ్రైవరు...

ఒకవైపు పరిమితికి మించి భారీ వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా, కొంతమంది డ్రైవర్లు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని సందర్భాల్లో పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా జరిమానా విధిస్తున్నా మెజార్టీ డ్రైవర్లు మాత్రం వేగాన్ని నియంత్రించకుండా ఇష్టానుసారంగా అతివేగంతో వాహనాలు నడుపుతున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఆందోళనకు గురవుతున్నారు.

అధిక లోడుతో వెళ్లే వాహనాలను నియంత్రించినా....

ఇటీవల పూడిమడక రోడ్డులో అధిక లోడుతో భారీ వాహనాలు వెళ్తుండేవి. దీంతో ఈ మార్గంలో ప్రమాదాలు పెరిగిపోవడంతో స్థానికులు పలు దఫాలుగా ఆందోళనలు చేయడం, కలెక్టర్‌కు వినతులు అందించిన ఫలితంగా పగటి పూట భారీ వాహనాలు తిరగడం మానేశాయి. కేవలం రాత్రుల సమయంలోనే అధిక లోడుతో భారీ వాహనాలు వెళ్తుండేవి. అయితే గత కొద్ది రోజులుగా భారీ వాహనాలు ఇష్టానుసారంగా తిరగడంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అధిక వేగంతో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

రహదారి విస్తరణ వేగవంతంతో సమస్య పరిష్కారం...

పూడిమడక రోడ్డులో భారీ వాహనాల ద్వారా **ప్రమాదాలు త**గ్గాలంటే తప్పనిసరిగా రహదారి **విస్తరణ చేయాల్సి** ఉంది. ఈ పనులు వేగవంతం కావడం ద్వారా సమస్య పరిష్కారానికి నోచుకోగలదన్న వాదన వినిపిస్తుంది. అయితే రహదారి విస్తరణలో భాగంగా బాధితులకు, ప్రభుత్వానికి మధ్య నగదు పరిహారం పంపిణీ సమస్యగా మారడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. భారీ వాహనాలకు కళ్లెం వేయాలంటే తప్పనిసరిగా రహదారి విస్తరణ ప్రక్రియ జరగాల్సిందేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడపాలి



పూడిమడక రోడ్డులో రోజు రోజుకూ ట్రాఫిక్ పెరిగిపోతోంది. భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో భయంగా ఉంటుంది. అతివేగంగా భారీ వాహనాలు వచ్చేస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని పలువురు కలవర పడుతున్నారు. అధిక లోడుతో వెళ్లే భారీ వాహనాలను కొంతమేర నియంత్రించినా ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడపాల్సి ఉంది.

– మళ్ల వేణుబాబు, ద్విచక్ర వాహనదారుడు, మునగపాక

ప్రమాదాలు జరగకుండా చర్యలు



పూడిమడక రోడ్డులో అధిక లోడుతో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించగలిగాం. కొన్ని సందర్భాల్లో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. అధికవేగంతో భారీ వాహనాలు వెళ్తున్న సందర్భాల్లో డ్రైవర్లకు జరిమానా విధిస్తున్నాం. భారీ వాహన డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడిపి ప్రమాదాలు జరగకుండా చూడాలి. భారీ వాహన డ్రైవర్లు, బ్రాండెక్స్ బస్సు డ్రైవర్లకు పలుమార్లు అవగాహన కల్పించాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– పి.ప్రసాదరావు, ఎస్‌ఐ, మునగపాక

ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కేసులు



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సన్నిబాబు

నక్కపల్లి: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ సన్నిబాబు హెచ్చరించారు. గురువారం ఆయన నక్కపల్లి, వేంపాడు ఆటో స్టాండుల్లో డ్రైవర్లతో మాట్లాడారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, అనుభవం లేని వారికి ఆటోలు ఇవ్వడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. జాతీయ రహదారిపై వెళ్లే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారని, ఇప్పటికే పలుమార్లు హెచ్చరించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పది మందికిపైగా విద్యార్థులను ఎక్కిస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమన్నారు. ఆటోలకు సంబంధించిన రికార్డులు సరిగా ఉండటం లేదన్నారు. డ్రైవర్లలో మార్పు రాకపోతే కేసులు నమోదు చేసి భారీగా అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు.

పైడితల్లి గుడికి భక్తుల తాకిడి



మామిడివాడ పైడితల్లి అమ్మవారి సన్నిధిలో భక్తులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో మామిడివాడ పైడితల్లి గుడికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న ఇక్కడ అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటోంది. ఈ సందర్భంగా గురువారం అమ్మవారి గుడి వద్ద భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పత్రికా స్వేచ్ఛను అణగదొక్కే ప్రయత్నమే..

- సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలపై నిరసనలు
- తహసీల్దార్లకు వినతి పత్రాలు

నక్కపల్లి: ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విజయవాడలో సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు చొరబడి సోదాలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. పాయకరావుపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు నల్ల రిబ్బన్లు ధరించి పోలీసుల వైఖరి, ప్రభుత్వ కక్ష సాధింపులను నిరసిస్తూ తహసీల్దార్ ఆర్ నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. పత్రికా చరిత్రలో ఈ రోజును బ్లాక్ డేగా పరిగణిస్తున్నామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక పత్రిక ఎడిటర్ ఇంట్లోకి ముందస్తు నోటీసులు లేకుండా పోలీసులు ప్రవేశించడం దారుణమని ఏపీయూడబ్ల్యూజే పాయకరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆచంట రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు నీలి వెంకటసత్యనారాయణ తెలిపారు. పత్రికా స్వేచ్ఛను అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వంలో జరిగే అవినీతి, అక్రమాలను పత్రికలు రాయడానికి వీల్లేదన్న సంకేతాన్ని కూటమి ప్రభుత్వం పంపిస్తోందన్నారు. ఈ వ్యవహారంపై కోర్టులు జోక్యం చేసుకుని పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు రమేష్, డి. రాంబాబు, కె. హరిబాబు, కె.వెంకటేష్, గణేష్, పి. రామం, కె. తాతాజీ, డి.ఎం.పి. కుమార్, రమణబాబు, తదితరులు పాల్గొన్నారు. పాయకరావుపేటలో తహసీల్దార్‌కు స్థానిక పాత్రికేయులు వినతి పత్రం ఇచ్చారు.



నక్కపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న పాత్రికేయులు

యలమంచిలిలో పాత్రికేయుల నిరసన

యలమంచిలి రూరల్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసుల సోదాలు, దురుసు ప్రవర్తన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని పాత్రికేయులు అభిప్రాయపడ్డారు. ఎలాంటి ముందస్తు అనుమతి గానీ, నోటీసులు గానీ ఇవ్వకుండా అక్రమంగా ఇంట్లోకి చొరబడడం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనంటూ గురువారం యలమంచిలిలో పత్రికా విలేకరులు నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని వారంతా హితవు పలికారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగేలా పోలీసులతో బలవంతపు చర్యలు తీసుకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఇలాంటి చర్యలు విడనాడాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ విష్ణుమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు పిల్లా శివ, చాకలి నూకరాజు, కూచిమంచి శ్రీనివాసు, ఆడారి నాగ శ్రీనివాసరావు, పీవీఎస్ ఈశ్వరదత్తు, జోగా తలుపులు పాల్గొన్నారు.



యలమంచిలిలో ఆర్‌ఐ విష్ణుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

ఐదు మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు శంకుస్థాపన

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఐదు చోట్ల మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. యలమంచిలి పట్టణం, మంత్రిపాలెం, శేషుకొండ కాలనీ, కొత్తపాలెం, తెరువుపల్లి గ్రామాల్లో రూ.75 లక్షల ఎస్‌ఏసీ నిధులతో నిర్మించనున్న ఒక్కో ప్లాంటు సామర్థ్యం 0.4 ఎంఎల్‌డీలుగా ఉంటుందని అధికారులు తెలిపారు. వీటి నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే, ఈ ప్లాంట్ల ద్వారా 100 శాతం మురుగునీటిని శుద్ధి చేసి పంటలు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ బీజీఎస్ ప్రసాదరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు

భూసార పరీక్షలతో మంచి ఫలితాలు

మునగపాక: ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అనకాపల్లి జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు తెలిపారు. మండలంలోని చూచుకొండ, చెర్లోపాలెం గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించి రైతులకు మట్టి నమూనా పరీక్షలపై అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు పూర్తి వివరాలు అధికారులకు అందించాలని సూచించారు. ఏవో సీహెచ్ జ్యోత్స్నకుమారి, ఏఈవో పద్మిని, వీహెచ్‌ఏ పైడిరాజు, వీఏఏ నవ్య పాల్గొన్నారు.



చెర్లోపాలెంలో పర్యటిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు

ప్రజల భద్రతకు సేఫ్ స్టే యాప్

అచ్యుతాపురం రూరల్: ప్రజల భద్రత దృష్ట్యా గురువారం అచ్యుతాపురంలో లాడ్జీలు, హోటళ్ల యాజమానులకు సేఫ్ స్టే యాప్‌పై సీఐ నమ్మి గణేష్ అవగాహన కల్పించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అపరిచితులను అరకట్టేందుకు ఈ యాప్‌ను అచ్యుతాపురంలో అన్ని లాడ్జీలు, హోటళ్ల యజమానుల మొబైళ్లలో డౌన్‌లోడ్ చేయించారు. వారి వివరాలు ఏవిధంగా సేకరించాలన్న విషయమై వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు.



లాడ్జీలు, హోటళ్ల యజమానులకు సేఫ్ స్టే యాప్ అవగాహన కల్పిస్తున్న సీఐ నమ్మి గణేష్

చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

అచ్యుతాపురం రూరల్: చిన్నతనం నుంచి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తే దేహాభివృద్ధి చెందుతుందని ఇషాన్ చిల్డ్రన్ ఆస్పత్రి వైద్యుడు ధర్మిరెడ్డి వెంకట్ తెలిపారు. వీఆర్ సమ్మర్ క్యాంప్ ఆధ్వర్యంలో 50 మంది పిల్లలకు గురువారం ఇక్కడ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. పిల్లలు ఆటల పోటీల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. ఆకు కూరలు, చెక్కీలు, చోడిపిండి జావ, కోడి గుడ్డు, పాలు, నెయ్యి, నువ్వుల నూనె వంటి పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోచ్ వెంకట్, సమ్మర్ క్యాంప్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పిల్లలకు హైట్, వెయిట్ చెక్ చేస్తున్న వైద్యుడు ధర్మిరెడ్డి వెంకట్

తెలుగు భాషపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు తులసీరావు

మునగపాక: తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు పెంటకోట తులసీరావు కోరారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం ఆయన తెలుగు భాషపై అవగాహన కల్పించారు. తెలుగులో రాయడం, చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. దేశభక్తిపై ఆసక్తి చూపాలన్నారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా ఇటువంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక మండలం గవర్ల అనకాపల్లిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సీఐటీయూ నేత గనిశెట్టి సత్యనారాయణ గురువారం సందర్శించారు. అనకాపల్లి జిల్లా చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరవాడ క్రాఫ్ట్ టీచర్ జ్యోతిర్మయి పిల్లలకు కళాకృతులు, బొమ్మల తయారీపై అవగాహన కల్పించారు. అనకాపల్లి జిల్లా చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, కె.రామలక్ష్మి, ఆళ్ల మహేశ్వరరావు, ఆళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరవాడ క్రాఫ్ట్ టీచర్ జ్యోతిర్మయి

చిన్నారులకు ఆటల పోటీలు

అచ్యుతాపురం: బాల్య దశలో పరుగు, కప్పగంతులు, కబడ్డీ, ఉప్పున పట్టి వంటి సంప్రదాయ ఆటలు ఆడటం ద్వారా శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఆయన చిన్నారులకు కప్పగంతులు ఆడించి, దాని ప్రాధాన్యతను వివరించారు. చిన్నారి దశలోనే శరీర కదలికలు వేగంగా ఉండే ఆటలు ఆడటం ద్వారా కండరాల వృద్ధికి, ఆరోగ్య మెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. పరుగు పందెం, హై జంప్, లాంగ్ జంప్ వంటి క్రీడలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. అయితే వ్యాయామ ఉపాధ్యాయుడు లేదా స్థానిక సీనియర్ ఆటగాళ్ల పర్యవేక్షణలోనే కొన్ని ఆటలు ఆడాలని సూచించారు.



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పుస్తక పఠనం మంచి అలవాటు

కోటవురట్ల: గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు మస్తాన్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. మంచి పుస్తకాలు చదవడం ద్వారా మంచి నడవడిక అలవడుతుందని, తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం కలుగుతుందన్నారు.

పైడితల్లి అమ్మవారి గరగ ఊరేగింపు

ఎస్.రాయవరం: కొరుప్రోలులో పైడితల్లి అమ్మవారి జాతర పురస్కరించుకుని అమ్మవారి గరగల ఊరేగింపు సందడిగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో పల్లీ కులస్తులు అమ్మవారి జాతరను ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గ్రామంలో వైఎస్సార్‌కాలనీ, జగనన్న కాలనీల్లో సైతం అమ్మవారి గరగను ఊరేగించారు. డప్పుల వాయిద్యాల మధ్య ఈ కార్యక్రమం జరిగింది.



అమ్మవారి గరగ ఊరేగింపులో భక్తులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఎస్.రాయవరం: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఆటోలు నడపవద్దని ఎస్‌ఐ విభీషణరావు సూచించారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. అధిక లోడుతో ప్రయాణం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా నడపడం వంటి పనులు మానుకోవాలన్నారు.



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ విభీషణరావు

వెంకన్న ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న గణపతిరావు, శేషుకుమారి దంపతులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలో కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వాములవుతున్నారు. దీనిలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఆడారి గణపతిరావు, శేషుకుమారి దంపతులు గురువారం రూ.50 వేలను విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఆడారి వెంకట ప్రభాకరరావు, వరహా సత్యవతి దంపతులు రూ.10 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కాంట్రేగుల జగ్గారావు, వెలగా శ్రీనివాసరావు, పెంటకోట ఉమేష్, సూరిశెట్టి స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.